కలగా నర్రవాడ పర్యాటక హబ్

రెండేళ్ల క్రితం అధికారుల స్థల పరిశీలన

- వెంగమాంబ ఆలయాభివృద్ధికి సైతం పడని ముందడుగు
- ప్రతిపాదనలు పంపామంటున్న అధికారులు
- పర్యాటకంగా అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి అవకాశాలు
- దేవస్థానానికి డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని భక్తుల డిమాండ్



నర్రవాడను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రెండేళ్ల క్రితం స్థల పరిశీలన చేసిన జేసీ కూర్మనాథ్

దుత్తలూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నర్రవాడను పర్యాటక హబ్‌గా మార్చేందుకు రెండేళ్ల క్రితం అడుగులు ముందుకు పడ్డాయి. అప్పట్లో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అధికారులు స్థల పరిశీలన జరిపారు. ఆ తరువాత ఇంతవరకు సంబంధిత అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై వెంగమాంబ భక్తులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో స్థల పరిశీలన

గతంలో నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయానికి వచ్చే భక్తులు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆరేళ్ల క్రితం ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పచ్చవ కరుణాకర్‌బాబు తన సొంత నిధులతో పాటు దాతల నుంచి విరాళాలను సేకరించి కొన్ని సౌకర్యాలు కల్పించారు. హోమగుండం, అన్నదానసత్రం, కళ్యాణ వేదిక, షాపింగ్ కాంప్లెక్స్, క్యూలైన్లు, అమ్మవారి పుష్కరిణి, కొండపై అమ్మవారి విగ్రహం ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలోనే నర్రవాడ క్షేత్రాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దితే మరింత అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నర్రవాడ పరిసరాల్లో 50 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి హరిత రెస్టారెంట్స్‌తో పాటు భక్తులు సేదదీరేందుకు వసతి సౌకర్యాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, గ్రీనరీ, తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు 2023 జూన్ 8న అప్పటి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ కావలి ఆర్డీఓ శీనానాయక్‌తో కలిసి నర్రవాడ బైపాస్ రోడ్డు సమీపంలో 22 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సదరు భూమిని పర్యాటక శాఖకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు నర్రవాడ క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులతో పాటు వెంగమాంబ భక్తుల్లో ఆనందం వెల్లివిరిసింది. అయితే రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి పురోగతి లేకపోవడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్రంతో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి వలస వాసులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. అలాగే ప్రతి గురు, ఆదివారాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

ఆలయ అభివృద్ధికి ప్రణాళికల తయారీ

గత నవంబరులో వెంగమాంబ ఆలయ అభివృద్ధికి సంబంధించి దేవదాయశాఖ ఇంజనీర్లు, శిల్పి పరిశీలన జరిపారు. అంచనాలను రూపొందించేందుకు ఆలయ పరిసరాలను కొలతలు వేశారు. సీజీఎఫ్ నిధులు, దాతల విరాళాలతో ఆలయ అభివృద్ధి చేపట్టేందుకు, ఆలయ ప్రాకారాన్ని నిర్మించేందుకు తగిన అంచనాలు రూపొందించారు. వీటిని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు పంపించారు. అయితే ఇప్పటి వరకు దేవదాయశాఖ నుంచి ఎలాంటి స్పష్టత లేదు.

నెరవేరని డబుల్‌రోడ్డు హామీ

నర్రవాడ వెంగమాంబ ఆలయానికి వెళ్లే రోడ్డు ఇరుకుగా మారడంతో బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన నేటి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నర్రవాడ దేవస్థానానికి డబుల్ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం దేవదాయశాఖ మంత్రిగా ఉన్నందున హామీని నిలబెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్నప్రసాద వితరణ కోసం భక్తుల విన్నపం

గతంలో వెంగమాంబ పేరంటాలు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు గురు, ఆదివారాల్లో మాత్రమే అన్నదానం చేసేవారు. మిగిలిన వారాల్లో అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు భోజన వసతి లేక ఇబ్బందులు పడేవారు. దీన్ని గమనించిన గతంలో చైర్మన్‌గా పని చేసిన కరుణాకర్‌బాబు నిత్యాన్నదానాన్ని ప్రారంభించారు. తదానంతరం కరోనా వ్యాప్తితో అన్నదానాన్ని కొన్ని నెలల పాటు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం ప్రారంభించినప్పటికీ గురు, ఆదివారాలకు మాత్రమే పరిమితం చేశారు. దీంతో మిగిలిన వారాల్లో భక్తులు మండల కేంద్రాలకు వెళ్లి తమ ఆకలి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నర్రవాడను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు వెంగమాంబ దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసి నిత్యాన్నదానాన్ని కొనసాగించాలని భక్తులు కోరుతున్నారు.



గత నవంబరులో దేవస్థానం అభివృద్ధికి సంబంధించి పరిశీలన చేసిన ఇంజనీర్, శిల్పి

ఆలయ అభివృద్ధికి నివేదికలు



వెంగమాంబ ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ ఇంజనీర్లు, శిల్పుల ద్వారా కొలతలు తీసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ప్రభుత్వ సహకారంతో ప్రాధాన్యత క్రమంలో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. నిత్యాన్నదానానికి బడ్జెట్ కేటాయింపు లేదు.

– ఉషశ్రీ, ఆలయ కార్యనిర్వహణ అధికారిణి

క్లుప్తంగా

ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఉదయగిరి రూరల్: గన్నేపల్లి పంచాయతీలో జరుగుతున్న అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారి చీరల వేలంపాటను నిర్వహించారు.

ఖరీఫ్ పంటల సాగులో మెళకువలు పాటించాలి



సంగం: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు చేయించుకోవడం, పెట్టుబడులు తగ్గించుకోవడం, సేంద్రియ ఎరువుల వినియోగం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ విజయకుమార్‌నాయక్, సురేఖాదేవి, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

రేపట్నుంచి గంగా భవానీ తిరునాళ్ల


ఉదయగిరి రూరల్: గంగిరెడ్డిపల్లెలో కొలువైన అనంతపూరి గంగాభవానీ తిరునాళ్లను ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. 14న ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం, రాత్రికి గ్రామోత్సవం, 15న ఉదయం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. 15న రాత్రి 8 గంటలకు గంగాభవానీ అమ్మవారి నిలుపు, కొమ్మువారి కథ, గ్రామోత్సవం, 16న అమ్మవారికి కుంకుమార్చన, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామోత్సవం, 17న ఉదయం గ్రామోత్సవం, మధ్యాహ్నం భజన, సాయంత్రం ఎడ్ల బండలాగుడు పోటీలు, బండ్ల పొంగళ్ల నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆశ్రమ పాఠశాలకు రూ.లక్ష విరాళం



ఆత్మకూరురూరల్: పట్టణంలోని కాశీనాయన ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ ఏడాది పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని తన కార్యాలయంలో పాఠశాల యాజమాన్యానికి నగదు మొత్తాన్ని అందజేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పన కోసం నగదును ఖర్చు చేయాలని కోరారు. ట్రస్ట్, కాశీనాయన ఆశ్రమ పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం




ఉదయగిరి: మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ సైదాపురం మండలానికి బదిలీపై వెళ్తున్న ఎం సుభద్రను రెవెన్యూ సిబ్బంది, నాయకులు గురువారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. తహసీల్దార్‌గా అందించిన సేవలను కొనియాడారు. డీటీ షాజియా, వీఆర్వోలు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి గురువారం తెలిపారు. బీఎస్సీ మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బొటని, బీఏ ఎకనామిక్స్, హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఆర్మీ కెప్టెన్‌కు సత్కారం



ఉదయగిరి రూరల్: మండలంలోని సర్వరాబాద్‌కు చెందిన ఆర్మీ కెప్టెన్ దారపనేని దినేష్‌ను అడవి పేరంటాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సైనికులు గురువారం ఘనంగా సత్కరించారు. అడవి పేరంటాలమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సైనికులు పులుగుర్ల వెంగయ్య, మేడేపల్లి రత్నయ్య, గడ్డం నర్సయ్య, వెంకటేశ్వర్లు, మహేశ్వరరావు, రత్తయ్య పాల్గొన్నారు.

కనులపండువగా ఆత్మారామస్వామి రథోత్సవం



సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామవీధులలో రథోత్సవం నిర్వహించారు. భక్తులు తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన రథం ముందు టెంకాయలు, గుమ్మడికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయకర్తలుగా పులగం మల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై రాజేష్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జనరేటర్ పరిశీలన

ఉదయగిరి రూరల్: గండిపాళెంలోని పాన్నెబోయిన చెంచురామయ్య జలాశయానికి సంబంధించిన జనరేటర్ పనితీరును ప్రాజెక్టు డీఈఈ చంద్రమౌళి గురువారం పరిశీలించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జనరేటర్‌ను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అనంతరం కాలువలను పరిశీలించి చేపట్టాల్సిన పనులను గుర్తించారు. ఆయన వెంట ఏఈ వేణు, సిబ్బంది కూర్మయ్య ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి ప్రతిభ

మర్రిపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల్లూరులో గురువారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డీసీపల్లి పంచాయతీ కార్యదర్శి మహేంద్ర ప్రతిభకనబర్చినట్లుగా ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ తెలిపారు. జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీలకు డీసీపల్లి పంచాయతీ నుంచి ముగ్గురు హాజరవగా మహేంద్ర ద్వితీయస్థానంలో రాణించడం అభినందనీయమన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం



సీతారామపురం: సింగారెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ షాను



కలిగిరిలో అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం



చేజర్ల మండలం మాముడూరులో..



వింజమూరులో..

వింజమూరు(ఉదయగిరి)/కలిగిరి/సీతారామపురం/ చేజర్ల(ఆత్మకూరురూరల్): అంగన్‌వాడీ పిలుస్తోందిలో భాగంగా వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీడీపీఓ పద్మజాకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల్లో నైతిక, దేశభక్తి విలువలను పెంపొందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. సూపర్‌వైజరు సుజాత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అలాగే కలిగిరిలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో వింజమూరు సీడీపీఓ పద్మజాకుమారి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఏసీడీపీఓ శర్మిష్ట, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీలు పద్మకుమారి, షర్మిల, శైలావాణి, లక్ష్మీకాంతం, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతారామపురం మండలం సింగారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త పావని పాల్గొన్నారు. చేజర్ల మండలం మాముడూరు అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇస్మాయిల్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

బాలలు బడిలోనే ఉండాలి



అనుమసముద్రంపేట: 14 ఏళ్లలోపు బాలలు బడిలోనే ఉండాలని, వారిని పనికి పంపడం నేరమని తహసీల్దార్ కే అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హెడ్స్ సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి మాట్లాడుతూ బాల కార్మికులు, వీధి పిల్లలను గుర్తిస్తే 1098కు తెలియజేయాలని కోరారు. ఎంఈఓ-2 సాయిప్రసాద్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వెలుపోడులో గ్రామసభ

దగదర్తి: వెలుపోడులో తహసీల్దార్ పీ కృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభను గురువారం నిర్వహించారు. పలువురు గ్రామస్తులు భూమి లేని తాము గత కొన్నేళ్లుగా ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్నామని, తమకు పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. స్పందించిన తహసీల్దార్ అసైన్మెంట్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అంకమ్మ తిరునాళ్లకు తరలిన భక్తులు



అంకమ్మ తిరునాళ్లకు ట్రాక్టర్‌లో తరలివెళుతున్న భక్తులు

కలిగిరి: గొట్టిగుండాలలో జరుగుతున్న అంకమ్మ తిరునాళ్లకు మండలంలోని పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు గురువారం తరలివెళ్లారు. అమ్మవారికి మొక్కుకున్న భక్తులు ప్రత్యేకంగా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లను అలంకరించుకుని బంధుమిత్రులతో సహా బయలుదేరివెళ్లారు. కాగా గొట్టిగుండాల అంకమ్మ తిరునాళ్లకు తరలి వెళుతున్న భక్తులకు తెల్లపాడులో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మారెళ్ల మహాదేవరెడ్డి, మమత దంపతులు మంచి నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. గత 30 ఏళ్లుగా తిరునాళ్లకు వెళ్లే భక్తుల దాహార్తిని తీరుస్తున్నట్లు వారు తెలిపారు.

నేత్రపర్వంగా గజ వాహనోత్సవం



గజ వాహనంపై కోటేశ్వరస్వామి

సంగం: దువ్వూరులో జరుగుతున్న గంగాపార్వతి సమేత కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గజ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.


డీసీపల్లిలో 495 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 495 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 804 బేళ్లు రాగా, 495 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.180, సగటున రూ.236.69 ధర పలికిందని వివరించారు. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ రేపు

ఉదయగిరి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో గుర్తించిన 111 ప్రదేశాల్లో యోగాపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సహకారంతో టీఓటీలు యోగాపై శిక్షణ ఇస్తారని చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో శిక్షణలో పాల్గొని యోగా ఆవశ్యకతను తెలుసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం



సీతారామపురం : స్థానిక బెస్తకాలనీకి చెందిన కిష్టా సురేష్ కుటుంబ సభ్యులకు జనసేనా నాయకులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల కిష్టా సురేష్ బోన్ కేన్సర్‌తో మృత్యువాత పడిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకుడు భోగినేని కాశీరావు సహకారంతో మండల నాయకులు భోగినేని సులోచనమ్మ, భోగినేని కాశీరత్తయ్య రూ.15 వేలు నగదు సాయం అందజేశారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

సీతారామపురం: విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన వేంపాడులో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నూతలపాటి పెద్దవెంగళరావు తన గేదెలను మేత కోసం పొలాల్లోకి తోలుకెళ్లగా ఓ గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

వైభవంగా వెంగమాంబకు పల్లకిసేవ



వెంగమాంబకు పల్లకిసేవ నిర్వహిస్తున్న దృశ్యం

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు ఆలయంలో గురువారం పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. తొలుత వెంగమాంబ, గురువయ్య దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల నడుమ దేవస్థానం చుట్టూ ప్రదక్షిణ గావించారు.

వెండి కిరీటాల బహూకరణ

వెంగమాంబ పేరంటాలు, గురవయ్య దంపతులకు బీజేపీ మండలాధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి,లక్ష్మి దంపతులు వెండి కిరీటాలను గురువారం బహూకరించారు. ఉత్సవ విగ్రహాలకు అలంకరించేందుకు అరకేజీ వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన కిరీటాలను ఆలయ ఈఓ ఉషశ్రీకి అందజేశారు. బీజేపీ నాయకులు అందె రామయ్య, పెసల కృష్ణ, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే వెంగమాంబ దంపతులకు నర్రవాడ జనార్దనస్వామి ఆలయ చైర్మన్ మాదాల ఎస్ బాబూరావు పట్టువస్త్రాలు సమర్పించారు.

వెంగమాంబ ఆలయాన్ని దర్శించిన దేవదాయశాఖ ఆర్‌జేసీ

నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి ఆలయాన్ని దేవదాయ శాఖ తిరుపతి జోన్ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్‌ఆజాద్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ ఉషశ్రీ, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం పరిసరాలను పరిశీలించి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఈఓను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఏఓ సురేష్‌బాబు బదిలీ



కలిగిరి: మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు ఏఎస్‌పేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కలిగిరిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయశాఖ సిబ్బంది బదిలీపై వెళుతున్న సురేష్‌బాబును గురువారం ఘనంగా సత్కరించారు.

ఏఎస్‌డబ్ల్యూఓ బదిలీ



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఏఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న శ్రీదేవి నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఐ కృష్ణయ్య బాధ్యతలను స్వీకరించారు. పట్టణంలోని బీసీ వెల్ఫేర్ అధికారి కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న శ్రీదేవితో పాటు కొత్తగా వచ్చిన కృష్ణయ్యను వార్డెన్లు గురువారం సత్కరించారు.

రక్తదాన శిబిరం



ఆత్మకూరురూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలికి చెందిన సార్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ ప్రాజెక్ట్ మేనేజరు జే బెనోమి , డాక్టర్ పద్మజ, ల్యాబ్‌టెక్నీషియన్ రవి, వీసేవ ఫౌండర్ వినయ్, సిబ్బంది కవిత, సునంద, సుస్మిత, జయంతి, అనూషా, మొబీనా, జయ పాల్గొన్నారు.

విద్యార్థి కిట్ల పంపిణీ

సీతారామపురం : స్థానిక కోటవీధిలోని స్పెషల్ ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు ఎంఈఓ మస్తాన్‌వలీ గురువారం విద్యార్థి కిట్లను పంపిణీ చేశారు. వంటకు సన్న బియ్యాన్ని ఉపయోగించాలని, విద్యార్థుల హాజరును ఉదయం 10:30 గంటలలోపు యాప్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రామమోహన్




బాధ్యతలు స్వీకరించిన కే అనిల్‌కుమార్

ఉదయగిరి: మండల తహసీల్దార్‌గా లోకన రామమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుభద్ర సైదాపురానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రామమోహన్‌ను అడహక్ తహసీల్దార్‌గా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

ఏఎస్‌పేట తహసీల్దార్‌గా కే అనిల్‌కుమార్

అనుమసముద్రంపేట: మండల నూతన తహసీల్దార్‌గా కే అనిల్‌కుమార్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఏఎస్‌పేటకు బదిలీపై వచ్చారు. తొలుత హజరత్ ఖాజానాయబ్‌రసూల్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హిందూజాతి సంఘటితం కావాలి



ఉదయగిరి: భారతదేశ సమైక్య సమగ్రతకు పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా,తదితర దేశాలు ప్రమాదంగా పరిణమిస్తున్న తరుణంలో హిందూ జాతి సంఘటితంగా ఉండాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ అనేది దేశ ఐక్యతకు సంబంధించిన పదమని, దీనిని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. పొరుగు దేశాలు భారతదేశంలోని మతాలు, కులాల మధ్యన చిచ్చుపెట్టి అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సనాతన ధర్మాన్ని, హైందత్వాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.